## క్లుప్తంగా

### నూకాలమ్మ ఉత్సవ ఆదాయం రూ.12.90 లక్షలు



ఆలయం వద్ద జరుగుతున్న హుండీల లెక్కింపు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారికి ఉత్సవాల ద్వారా 12 లక్షల 90 వేల 742 రూపాయల ఆదాయం వచ్చింది. మార్చి 27వ తేదీ నుంచి 30 వరకు ఉత్సవాలు జరిగాయి. సోమవారం ఆలయం వద్ద ఉత్సవ నిర్వహణ అధికారి శ్రీధర్, ఆలయ కార్యనిర్వాహక అధికారి బొంగరాల మురళీమోహన్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. ఇందులో హుండీల ద్వారా రూ 5.99లక్షలు వచ్చింది. దర్శనం, టిక్కెట్ల ద్వారా రూ 6.91లక్షలు వచ్చింది. గత సంవత్సరం మొత్తం రూ. 10.69లక్షలు రాగా, ఈ సారి అదనంగా రూ. 2.21లక్షలు వచ్చింది.

### విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులతో దాత

కొమ్మాది: ఎలోహిమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారికవలసలో విద్యార్థులకు పెన్సిల్స్, పలకలు, బలపాలు, పుస్తకాలు, ఫ్లాంకులను పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాసరావు సోమవారం వీటిని విద్యార్థులకు అందజేశారు. పిల్లలకు ఇది పరీక్ష సమయం కావడంతో వీటిని అందజేసినట్లు తెలిపారు.

### కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

భీమునిపట్నం: కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివి.. భీమిలి చిన్నబజారు వద్ద ఆదివారం రాత్రి నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని రాంబోతు పైడిరాజు(64) అనే వ్యక్తి రోడ్డుపై నిలబడి చూస్తుండగా.. అదే సమయంలో విశాఖ నుంచి వస్తున్న కారు అతడిని ఢీకొని, కుడికాలిపై నుంచి వెళ్లిపోయింది. పైడిరాజుకు తీవ్ర గాయాలవడంతో వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సముద్ర స్నానానికి వచ్చి అస్వస్థతతో మృతి



పరదేశి (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి బీచ్‌కు సముద్ర స్నానానికి వచ్చిన వ్యక్తి అస్వస్థతకు గురై మరణించిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలివి.. గజపతినగరం మండలం మరుపల్లికి చెందిన గెద్ద పరదేశి(37) అక్కడ పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. కుమారుడు లోహిత్(4), స్నేహితులు సత్యనారాయణ, శంకర్, మణితో కలిసి ఆయన బీచ్‌కు వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానానికి దిగగా, కొద్దిసేపటికి పరదేశి అస్వస్థతకు గురవడంతో ఒడ్డుకు వచ్చేశాడు. పరిస్థితిని గమనించిన స్నేహితులు ఇక్కడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె కూడా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### పౌరాణిక కళాకారుడు అప్పారావుకు సన్మానం



ఉప్పాడ అప్పారావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తగరపువలస: ఉత్తరాంధ్ర పౌరాణిక కళాకారుడు ఉప్పాడ అప్పారావును ఆనందపురం మండల బీజేపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షురాలు పిల్లా విజయ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అప్పారావు గాత్రం, నటన గురించి కొనియాడారు ఈ సందర్భంగా కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు పట్నాయిక్, పచ్చిపులుసు కనకారావు, సీపాన సరిత తదితరులు పాల్గొన్నారు.

# కూలీల కొరత రైతుల కలత



తాటితూరులో కనకాంబరాలు ఏరుతున్న రైతు



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన మల్లెలు

## తెగుళ్ల బెడద

**మల్లె తోటలను తెల్లదోమ నాలుగేళ్లుగా పట్టి పీడిస్తోంది. నలుపు, ఆరెంజ్ పురుగు సాగుదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.** పూత దశలోనే మొగ్గలు చుట్టుకుపోయి గుత్తులు కరిగిపోతున్నాయి. దీంతో రైతులు ఎరువుల దుకాణాల యజమాని ఇచ్చిన మందులను మార్చి కొడుతున్నా ప్రయోజనం ఉండటం లేదని వాపోతున్నారు. 20 సెంట్లలో తోటకు రూ.500 ఖర్చు పెట్టి మందు తెస్తే ఒక్కరోజే మూడు ట్యాంకులకు వస్తుందంటున్నారు. అది పనిచేయకపోతే మళ్లీ కొత్త మందు ప్రయోగిస్తుంటారు. మల్లెలతో సమానంగా తెగుళ్ల బెడద లేని కనకాంబరాలు సాగు చేస్తూ కాస్త ఊరట పొందుతున్నారు.







తోటలో ఏరిన కనకాంబరాలు



బంటుపల్లి కళ్లాలలో మల్లెతోట

ఎర్రటి ఎండలు.. భరించలేని ఉక్క.. మల్లె సాగుకు అనుకూలమైన వాతావరణం. సంక్రాంతి మొదలుకుని వర్షాలు ప్రారంభమైన జూలై, సెప్టెంబరు వరకు వచ్చే దిగుబడిలో ఒక్కో నెల మల్లెలు ఒక్కో 'ధర'హాసం కురిపిస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో మల్లెలు రూ.250 నుంచి రూ.400 మధ్య దోబూచులాడుతున్నాయి. అయితే, మల్లె సాగుకు కూలీల కొరత భారంగా మారుతోంది. దీంతో సాగుదారులు ఇబ్బంది పడుతున్నారు.

తగరపువలస: మల్లెతోటలను కూలీల కొరత వేధిస్తోంది. కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్లడంతో వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భీమిలి నియోజకవర్గంలో మల్లెలు ఎక్కువగా మజ్జివలస, తాటితూరు, శింగనబంధ, బంటుపల్లి కళ్లాలు, పెద్దిపాలెం, ఆనందపురం, లొడగలవానిపాలెం, వెల్లంకి, గిడిజాల గ్రామాల రైతులు 50 ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. మొక్క దిగుబడి రావడానికి ప్రాంతాలను బట్టి పశువుల గెత్తం, డీఏపీ, యూరియా తదితర ఎరువులు వినియోగిస్తుంటారు. కొందరు రైతులు తెగుళ్లు అంతగా లేని కనకాంబరాలను మల్లెలో అంతరపంటగా సాగు చేస్తారు.

**ఉపాధి పనులకు ..**

కూలీల కొరతతో మల్లె సాగుదారులు ఇబ్బంది పడుతున్నారు. కూలీలకు ఉపాధి హామీ పనులకు ఉదయం 6 గంటలకు వెళ్లి 10 గంటల వరకు పని చేస్తే కనీసం రూ.200 కూలి లభిస్తుంది. మల్లెలు ఏరడానికి వచ్చే మహిళలకు రూ.30 టిఫిన్ పెట్టి చేతికి రూ.120 ఇస్తారు. మల్లెలు ఉదయం 11 గంటలలోగా మార్కెట్‌కు తరలించకపోతే పువ్వులుగా విడిపోయి వాటి ధర తగ్గిపోతుంది. కూలీల కొరత కారణంగా ఇతర వ్యవసాయ పనులు కూడా తగ్గిపోయాయి. దీంతో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలలో కొందరిని వ్యవసాయపనులకు మళ్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ రెండు చోట్లా కూలి వ్యత్యాసం కారణంగా గట్టిగా అడగలేకపోతున్నారు. చెట్లు కటింగ్, మడుల తయారీ, నీరు పెట్టడం, గొప్పులు, ఏరివేత, మందు కొట్టడం, తెగుళ్ల నివారణ తదితర పనులకు కూలీల కొరత కారణంగా ఏ ఒక్క రైతు 10 నుంచి 20 సెంట్లు సాగు చేయడానికి ముందుకు రావడంలేదు.

### సొంత తోటలతో చాకిరీయే..



సొంతంగా పూలసాగు చేసే మాలాంటి రైతులం ఉపాధిహామీ పనులకు వెళ్లలేం. ముఖ్యంగా మల్లెతోటలలో పని ఎక్కువగా ఉంటుంది. దిగుబడి ఎక్కువగా ఉండి మార్కెట్‌లో ధరలు ఉంటే సరే. లేదంటే మల్లెలు అమ్మిన డబ్బులు కూలీలకే సరిపోవు.

– పల్లి సంతోషి

### మిగతా వాటిలా దాచలేం



మిగిలిన పువ్వులను దాచినట్టు మల్లెలను దాచలేం. తోటలో కోత పూర్తయిన వెంటనే మార్కెట్‌కు తరలించాలి. మధ్యాహ్నం దాటితే మల్లె మొగ్గలు పువ్వులుగా మారి, ధరలు పడిపోతాయి.

– పల్లి కవిత

### పెళ్లిళ్ల సీజన్‌లోనే ..



మల్లెల దిగుబడి ఎక్కువగా ఉండి ధరలు కూడా ఎక్కువగా ఉంటేనే మల్లె రైతుకు మనుగడ. తెగుళ్ల బెడద బాధించకూడదు. ఆ పరిస్థితి ఎండలు, పెళ్లిళ్లు ఎక్కువగా ఉన్నప్పుడే సాధ్యపడుతుంది. ముందు ఉద్యానవన శాఖ తెగుళ్ల నుంచి రక్షించాలి.

– దొంతల గురునాయుడు

### ఒక్కోసారి చేతి డబ్బులు పడతాయి



ఆరుగురు కూలీలు ఐదు కిలోల మల్లెలు ఏరినప్పుడు, మల్లెలు ధర మార్కెట్‌లో రూ.250 ఉంటే అప్పుడు మన చేతి డబ్బులు పడతాయి. మల్లెలు అమ్మితే రూ.1250 వస్తాయి. కూలీలకు రూ.900 ఇచ్చి, మందులకు రూ.500 పెట్టాలి. అలాంటప్పుడు చేతిడబ్బులే రూ.150 పెట్టాలి.

– లెంక ఆదిలక్ష్మి

### ఎక్కువ సాగు చేయలేం



మనకు తోటలు ఎక్కువగా ఉన్నా సస్యరక్షణ కష్టం. ఒక్కో కుటుంబం 10 నుంచి 20 సెంట్లలో మల్లెలు సాగు చేసుకుంటే సరి. తెగుళ్ల బెడద లేని కనకాంబరాలు వేసుకుంటే ఖర్చులు కలిసివచ్చి, మల్లె సాగు లాభదాయకం అవుతుంది.

– దొంతల మోహన్ గణేష్



మల్లెలు ఏరుతున్న కూలీలు

## సాధుమఠం తీర్థానికి పోటెత్తిన జనం



తీర్థంలో దుకాణాల వద్ద సందర్శకుల సందడి

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి సాధుమఠం తీర్థానికి సోమవారం జనం పోటెత్తారు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల నుంచి వచ్చిన భక్తులతో వెల్లంకి రహదారులు కిక్కిరిసి పోయాయి. సర్వీస్‌రోడ్డుపై వందల రకాల దుకాణాలు ఏర్పాటు చేసి బొమ్మలు, తినుబండారాలు విక్రయించారు. సాధు మఠంతో పాటు పైడితల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు జాతీయరహదారి దాటడానికి ఆనందపురం పోలీసులు సహాయ సహకారాలు అందించారు. వాహనాలను నిలిపి భక్తులు రోడ్డు దాటడానికి సహకరించారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం



మధురవాడలో సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న కుమార్

మధురవాడ: సీపీఎం పోరాట వారసత్వం నిరంతరం కొనసాగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకు పార్టీ జాతీయ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మధురవాడ పీహెచ్‌సీ, మార్కెట్ తదితర ప్రాంతాల్లో సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపి, ఇబ్బందుల పాల్జేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సియాద్రి పైడితల్లి, డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, జి.కిరణ్, ఆర్.రవి, వి.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## అంధకారంలో హైవే పరిసరాలు



చీకటిగా వెల్లంకి సర్వీస్‌రోడ్డు



అంధకారంలో సంగివలస అండర్‌పాస్

తగరపువలస: ఆనందపురం నుంచి తగరపువలస వరకు జాతీయరహదారి పరిసరాలు పలుచోట్ల అంధకారంలో ఉన్నాయి. ముఖ్యంగా ఆనందపురం మండలంలోని వెల్లంకి నుంచి పెద్దిపాలెం వరకు జాతీయరహదారికి ఇరువైపులా సర్వీస్‌రోడ్లు చీకట్లో ఉన్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాల లైట్లు ఆధారంగానే పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే భీమిలి మండల పరిధిలో తాళ్లవలసకు ఇరువైపులా సర్వీస్‌రోడ్లు కూడా చీకట్లోనే ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో సంగివలస అండర్‌పాస్‌లో విద్యుద్దీపాలు ఎప్పుడో వెలగడం మానేశాయి. దీంతో తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వెలగని విద్యుద్దీపాలను పునరుద్ధరించి, జాతీయరహదారి, సర్వీస్‌రోడ్డులో ప్రమాదాలను నివారించాలని ఆనందపురం, భీమిలి మండలాల ప్రజలు కోరుతున్నారు.

## రూ.కోటికి పైగా ఆదాయం..

- వసతులు శూన్యం



వేములవలస మార్కెట్‌లో శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌లో వసతులు లేకపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్‌లో ఆశీల్ల వసూలుకుగాను ఇటీవల పుష్పలత అనే మహిళ రూ.1.39 కోట్లకు సొంతం చేసుకుంది. అంటే వేలం ద్వారా స్థానిక పంచాయతీకి మార్కెట్ నుంచి ప్రతిరోజూ రూ.38వేల పై చిలుకు ఆదాయం లభిస్తోంది. కాని మార్కెట్‌లో చూస్తే వ్యాపారులకు సరైన షెల్టర్లయినా లేవు. దీంతో ఎండైనా.. వానైనా ఆరుబయటే గతి. సరైన డ్రైనేజీల్లేక దుర్గంధంలోనే లావాదేవీలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఆనందపురం–వేములవలస పంచాయతీల మధ్య రాకపోకలకు ఈ మార్కెట్ ప్రధాన అంతరాయంగా ఉంది. పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగమైనా వెచ్చించి, వసతులు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

### దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు

భీమునిపట్నం: ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఒకరిపై దాడికి పాల్పడ్డ మరో వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. భీమిలి పెద్ద బజారు దరి పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం రాత్రి విశాఖకు చెందిన ఇరువర్గాల వారికి కొడవ జరిగింది. శ్రీను అనే వ్యక్తి, బమ్మిడి రఘును రాయితో కొట్టాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు శ్రీనుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### సీతారాములకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్ర మూర్తికి పల్లకి సేవ నిర్వహించారు. ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు రోజూ రామాలయం నుంచి ప్రారంభించి వీధుల్లో ఈ పల్లకీ సేవ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా రెండో రోజైన సోమవారం గ్రామంలోని వీధుల్లో సంకీర్తనలు ఆలపిస్తూ పల్లకీ సేవ నిర్వహించారు.

### మరోమారు కబ్జాకు యత్నం

తగరపువలస: ఆనందపురం పంచాయతీ జగనన్న కాలనీని ఆనుకుని సర్వే నంబర్ 276లో ఇటీవల ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నించిన వ్యక్తి సోమవారం పట్టపగలే మరోమారు కబ్జాకు ప్రయత్నించాడు. గత నెల 21న రాత్రి సుమారు 160 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు మార్క్ చేయడంతో స్థానికులు అడ్డుకుని, పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. దీనిపై 'రాత్రికి రాత్రే కబ్జా..' శీర్షికతో మార్చి 24న సాక్షిలో ప్రచురించిన సంగతి తెలిసిందే. సోమవారం కూడా తహసీల్దార్ అనుమతి ఇచ్చారంటూ స్థానికులను మభ్యపెట్టి తవ్వకాలు చేయడానికి ప్రయత్నించగా స్థానికులు అడ్డుకుని వీఆర్వోకు సమాచారం అందించారు. దీంతో కబ్జాదారుడు మరోమారు అక్కడి నుంచి ఉడాయించక తప్పలేదు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో కొందరి సహకారంతోనే తరచూ కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు.

## జోన్-2 రికార్డు స్థాయి కలెక్షన్

రూ.76.67 కోట్లు వసూలు



సెలవు రోజు కలెక్షన్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 76. 67కోట్లు వివిధ రకాల పన్నులు వసూలు చేసినట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఇందులో ఆస్తి పన్ను రు. 40.92కోట్లు, ఖాళీ స్థలాల పన్ను రూ. 35.75 కోట్లు వసూలు చేసినట్టు చెప్పారు.

## ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

మధురవాడ: పొట్ట కూటికోసం ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి సాగిస్తున్న తమను నేరస్తులుగా చూడవద్దని ఆటో కార్మికులు కోరారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు వేధింపులు ఆపాలన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం( సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 40వేల మంది ఆటోలు నడుపుతూ, కుటుంబాలు పోషించుకుంటున్నారన్నారు. ఇప్పుడంతా 99 శాతం టికెట్ సర్వీసుల మీదనే ఆధారపడి ఆటోలు నడుపుతున్నారని చెప్పారు. ఆటో కార్మికులపై పోలీసుల తీరు ఇబ్బందికరంగా ఉందని, కనీస గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆటోలో కనీసం 8మంది ప్రయాణికులకు అనుమతి ఇవ్వాలని.. అధిక చలానాలు, వసూళ్లు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం నార్త్ సబ్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావుకు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జి.చిన్నారావు, రాము, బంగార్రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్



భీమిలి ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉపవాసాలు, ప్రార్థనలు, దానధర్మాలతో నెలరోజుల పాటు నియమనిష్టలతో గడిపిన వారంతా ఈద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమిలిలోని ఈద్గా మైదానంలో జామియా మసీద్ ఇమాం నసీర్ అక్తర్ ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. మసీద్ పెద్దలు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయీం, షేక్ యాసిన్ పాల్గొన్నారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారు మజిద్ ఈ ఫిర్‌దౌసీలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆత్మీయ ఆలింగనాలతో ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. మజిద్ అధ్యక్షుడు ఆలమ్, కార్యదర్శి అహమ్మదర్, కోశాధికారి మస్తాన్ పర్యవేక్షణలో ప్రార్థనలు జరిగాయి.



సద్గురు సాయినాథ కాలనీలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

– భీమునిపట్నం/మధురవాడ